క్లుప్తంగా

నేడు మండలంలో ఎంపీ మోపిదేవి పర్యటన

చెరుకుపల్లి: మండలంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు బుధవారం ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ వైనం ఏడుకొండల రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు పొన్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని కూడా ఉదయం 7గంటలకు ప్రారంభించనున్నట్లు కొండలు రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఎస్పీ కార్యాలయానికి ఎస్ఐ చోడయ్య సరెండర్!

వేమూరు: బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయానికి ఎస్ఐ చోడయ్యను సరెండర్ చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు రేపల్లె డీఎస్పీ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో డీఎస్పీ టి.మురళీ కృష్ణ సోమవారం నేరసమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వేమూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ చోడయ్య మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. డీఎస్పీ కార్యాలయంలో ఇద్దరు కొట్టుకునే పరిస్థితి నెలకొంది. డీఎస్పీ ఇద్దరినీ విచారణ చేయగా ఎస్ఐ అవినీతి చిట్టాను సీఐ డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.. ఎస్ఐ అవినీతి చిట్టా గురించి ఎస్పీ కార్యాలయానికి డీఎస్పీ సమాచారం అందజేశారు. దీంతో ఎస్పీ కార్యాలయానికి ఎస్ఐ చోడయ్యను సరెండర్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ఎస్ఐను బాపట్ల ఎస్పీ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు సమాచారం.

తోపుడు బండి వితరణ

బాపట్ల అర్బన్: ఎస్టూ నీడీ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్‌బాబు తోట మంగళవారం పేద మత్స్యకార మహిళలకు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. అడవిపల్లి పాలెంలోని పేద మత్స్యకార ఒంటరి మహిళ జి.గాలెమ్మ పరిస్థితిని గమనించి వారికి ప్రకృతి ప్రసాదించే వనరులను విక్రయాలు జరిపే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక మత్స్యకారులు ఎరిపల్లి సత్యమ్మ, ఆసుపల్లి అప్పల నర్సమ్మ, టి.నాగన్నాథమ్మా, జామి లక్ష్మి, శివ గోగు, మల్లాది సత్తిబాబు, చాపల శ్రీను, ఆసుపల్లి బాబీలు, ఎరిపల్లి దానియేలు స్థానికులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని ఆంధ్రాప్యారిస్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించారు. రెండు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో జూనియర్స్‌లో ప్రథమ బహుమతిని దీప్తి, ద్వితీయ బహుమతిని శ్రీనిత్య, తృతీయ బహుమతిని సంజన గెలుచుకున్నారు. సీనియర్స్‌లో షేక్ లాస్య ప్రథమ, సాత్విక్ ద్వితీయ, ఆక్సా తృతీయ బహుమతిని గెలిచారు. సమీర, వర్షిణి, శ్రద్ధ ప్రత్యేక బహుమతులు పొందారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సంపూర్ణ పోషణ..ఆరోగ్య రక్షణ

- రక్తహీనతకు గుడ్‌బై...
- తగ్గుతున్న పౌష్టికాహార లోపం
- గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి భరోసా


గర్భిణులకు అందజేసే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లోని వస్తువులు

భట్టిప్రోలు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ తదితర పథకాలను అమలులోకి తీసుకొచ్చింది. కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం వల్ల ఆశించిన ఫలితాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత సమస్య లేకుండా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందచేస్తుంది. దీనివల్ల గర్భిణుల్లో రక్తహీనత తగ్గింది. పండంటి బిడ్డలకు జన్మనిస్తున్నారు.

నియోజకవర్గ పరిధిలో లబ్ధిదారులు..

నియోజకవర్గవ్యాప్తంగా 309 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో వేమూరు నియోజకవర్గ పరిధిలో ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలు 4,797 మంది ఉన్నారు. మూడు సంవత్సరాల నుంచి 6 సంవత్సరాలలోపు 3,480 మంది ఉన్నారు. అలాగే గర్భిణులు 1,079, బాలింతలు 1,188 ఉన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ చార్ట్ ప్రకారం రోజూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందచేస్తున్నారు. సంపూర్ణ పోషకాహారం అందడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందిస్తున్న కిట్లు...

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు 7 నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు ప్రతి నెలా రెండున్నర కిలోల బాలామృత ప్యాకెట్లు, 25 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు సరఫరా చేస్తున్నారు. ప్రతి నెల గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద కిలో అటుకులు, కిలో రాగి పిండి, కిలో జొన్నపిండి, పావు కిలో బెల్లం, పావు కిలో ఎండు ఖర్జూరాలు, పావు కిలో చిక్కీలు, 25 గుడ్లు, నాలుగు లీటర్ల పాలు అందజేస్తున్నారు.

మెనూ ఇలా..

సోమవారం	అన్నం, సొరకాయ పప్పు, గుడ్డు, పాలు
మంగళవారం	పులిహోర, టమాట పచ్చడి, గుడ్డు, పాలు
బుధవారం	అన్నం, సొరకాయ కూర, పప్పు, గుడ్డు, పాలు
గురువారం	అన్నం, కూర, సాంబారు, గుడ్డు, పాలు
శుక్రవారం	అన్నం, కూర, పప్పు, గుడ్డు, పాలు
శనివారం	అన్నం, కూర, పప్పు, గుడ్డు, పాలు

అందరికీ పోషకాహార కిట్లు..

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అన్ని రకాల పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ఇది రక్తహీనత నివారణకు, పౌష్టికాహార లోపాన్ని తగ్గించడానికి చక్కగా ఉపయోగపడుతుంది. చిన్నారులకు మెనూ ప్రకారం పోషకాహార కిట్లు అందజేయడం జరుగుతుంది.

– విజయలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీఓ, అమృతలూరు

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ


మలేరియా మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ విజయమ్మ, ఆరోగ్య సిబ్బంది


కొల్లూరు పీహెచ్‌సీలో మలేరియా నివారణపై ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ

రేపల్లె రూరల్: పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, ఫలితంగా అనేక వ్యాధులను దూరంగా ఉంచవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ అన్నారు. మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. మూడు రకాల దోమలు సుమారు 5 రకాల వ్యాధులను వ్యాప్తింపజేస్తాయని, వీటిని నివారించాలంటే ప్రతి ఒక్కరూ దోమల వృద్ధిని నివారించాలన్నారు. దోమల వృద్ధి జరగకుండా ఉండాలంటే పరిసరాలలో నీటి, తేమ లేకుండా పొడి వాతావరణం ఉండే విధంగా చూసుకోవటంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలలో దోమ లార్వా ఉంటే దానిని నాశనం చేయాలన్నారు. జ్వరం వంటి లక్షణాలు ఉంటే విధిగా రక్త పరీక్షలు చేయించుకుని వైద్యునిచే చికిత్సలు చేయించుకోవాలన్నారు. సొంత వైద్యం చేసుకోరాదని సూచించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

కొల్లూరు: దోమల నిర్మూలన ద్వారా మలేరియా వ్యాప్తిని అరికట్టవచ్చునని కొల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్.సుష్మసుకాన్ అన్నారు. మలేరియా నివారణా మసోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టాలని సూచించారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమైన దోమల నివారణపై అందరూ దృష్టి సారించాలని, తమ నివాస ప్రాంతాలలో మురుగు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. తెనాలి ఇన్‌చార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, సీహెచ్‌ఓలు విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్లు వి.మేరీ, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెరవలిలో...

పెరవలి(వేమూరు): పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియాను నివారించవచ్చని మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట సురేష్ తెలిపారు. పెరవలి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళ వారం మలేరియా నివారణ మాసోత్సవం నిర్వహించారు. గ్రామంలో మలేరియా నివారణపై వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వంగల పున్నారెడ్డి, శ్రీ కంఠ ఉమా కాంత్, రత్నకుమారి, బేబి జయశ్రీ, పున్నరావు, శ్రీనివాస్, మధుబాబు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు


క్రికెట్ బ్యాట్ బహూకరిస్తున్న పీహెచ్‌సీ ఉద్యోగి, వైఎస్సార్ సీపీ నాయకులు

కొల్లూరు: వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కొల్లూరులో నిర్వహిస్తున్న పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. కొల్లూరు బాలుర, బాలికోన్నత పాఠశాలల క్రీడా మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లు రెండో రౌండ్‌లో భాగంగా మంగళవారం 8 జట్ల నడుమ 4 మ్యాచ్‌లు జరిగాయి. ఫైరింగ్ ఫోనెక్స్ కొల్లూరు జట్టు వెల్లటూరు వారియర్స్‌కు జరిగిన పోటీలో కొల్లూరు జట్టు గెలుపొందింది. వలివేరు వీసీబీ, ఐలవరం జట్ల నడుమ నిర్వహించిన పోటీలో వలివేరు జట్టు విజయం సాధించగా, తోకలవారిపాలెం జట్టుపై పోటీపడిన వేమూరు జట్టు విజయాన్ని సొంతం చేసుకోగా, దోనేపూడి ఫైటర్స్, వేమవరం జట్ల నడమ జరిగిన పోరులో దోనేపూడి జట్టు గెలుపొందింది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలలో రాణించిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఓడిన జట్లకు ప్రోత్సాహక బహుమతులు కింద క్రికెట్ బ్యాట్‌లను కొల్లూరు పీహెచ్‌సీ ఉద్యోగి హరికృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు సింగం కృష్ణ ప్రసాద్, పలువురు నాయకులు అందజేశారు.

కూలి మినహాయించుకోవటం సరికాదు


బ్యాంకు మేనేజర్ భగత్‌కు వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కర్లపాలెం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులు చేసిన కూలీల నగదును బ్యాంకులో పంట రుణాలకు మినహాయించుకోవటం సరైనది కాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్ తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంగళవారం కర్లపాలెం యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కృష్ణమోహన్ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతూ పేరలిపాడు గ్రామానికి చెందిన పేదలు జీవనాధారం కోసం మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఉపాధిహామీ పనులు చేస్తున్నారని తెలిపారు. సదరు పనులకు సంబంధించిన నగదు బ్యాంకు ఖాతాలకు జమ అవుతుండటంతో బ్యాంకు సిబ్బంది పంట రుణాల బాకీ ఉన్న వారి నగదును జమ చేసుకుంటున్నారని తెలిపారు. ఉపాధిహామీ పనుల కూలి నగదు పంట రుణాలకు జమ చేయవద్దని కూలీలకు ఇవ్వాలని బ్యాంకు మేనేజర్‌ను కోరారు. పేరలిపాడు ఉప సర్పంచ్ కె.నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఉపాధిహామీ కూలీలు ఉన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలి..

బాపట్ల అర్బన్: ఉపాధి కూలీలను ఆన్‌లైన్ ఫొటో తీసే విధానాన్ని వెంటనే ఎత్తి వేయాలని వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. మండలంలోని నర్సాయపాలెం, కంకటపాలెం, మురుకుంటపాడు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రతివారం పని చేసిన దానికి ఎంత కూలి పడుతున్నది రోజుకి పే స్లిప్ లు ఇవ్వాలన్నారు. 200 రోజుల పనిదినాలు, రోజుకి రూ.600లకు కూలి పెంచాలన్నారు. మేట్లు, కూలీలు, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఉపాధ్యాయులతో 1985-86 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

జంపని(వేమూరు): పాఠశాల అభివృద్ధికి తమ సహకారం పూర్తిగా ఉంటుందని పూర్వ విద్యార్థులు తెలిపారు. జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు మంగళవారం సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ 1985–86 సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు కొంతమంది ఉద్యోగ రంగాల్లో వివిధ స్థాయిల్లో ఉండటం జరిగిందన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ముద్రబోయిన సూర్యనారాయణ, అశోక్, చల్లగుండ్ల నారాయణరావు, కృష్ణమూర్తి, గోపాలకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుంటూరు వెళ్లి పెన్షన్ అందజేత



రేపల్లె: పట్టణంలోని 12వవార్డుకు చెందిన మీసాల రామకోటేశ్వరరావు రహదారి ప్రమాదానికి గురై గుంటూరులోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వార్డు వలంటీరు చెరుకూరి సౌమ్యసుగుణ మంగళవారం గుంటూరుకు వెళ్లి లబ్ధిదారునికి పింఛన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరరావు కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

'క్షయ రహిత తెనాలి'లో భాగస్వాములు కావాలి

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిలేని తెనాలి రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ టి.రవికుమార్ కోరారు. పాత ప్రభుత్వ వైద్యశాలలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షయ సోకిన వారు వెంటనే టీబీ యూనిట్‌కు వచ్చి చికిత్స పొందాలని సూచించారు. అవసరమైన మందులను కూడా ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీజాన్, డాక్టర్ దేవిక పాల్గొన్నారు.

గంగమ్మ కొలుపుల మహోత్సవాలు



తెనాలిటౌన్: పట్టణ పరిధిలోని పినపాడులో పెరుగువారి ఇలవేల్పు గంగమ్మ కొలుపుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కొలుపుల్లో మంగళవారం గంగమ్మతల్లిని కనక తప్పెట్లు, మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు. గుడి కమిటీ అధ్యక్షుడు పెరుగు మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వెంకటస్వామి, శ్రీనివాసరావు, ఆంజనేయులు, చిన్ని నాగేశ్వరరావు, శివరామకృష్ణ, ఆదినారాయణ, సత్యనారాయణ పర్యవేక్షించారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆర్థికసాయం


భట్టిప్రోలులో ఆర్థికసాయం అందజేస్తున్న ఏపీఎం శ్రీమన్నారాయణ

భట్టిప్రోలు: స్త్రీ నిధి, ఉన్నతి, ఎస్‌జీఎస్‌వై, వీఆర్‌ఎఫ్ అంతర్గత అప్పులు రికవరీ చేస్తే తప్పని సరిగా గ్రామ సంఘం రసీదు ఇవ్వాలని మండల సమాఖ్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ గుడిమెట్ల శ్రీమన్నారాయణ కోరారు. మంగళవారం భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో డ్వాక్రా సభ్యులైన 10 మంది జగనన్న కాలనీ లబ్ధిదారులకు రూ. 35 వేల చొప్పున రూ. 3.50 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మండలంలో పని చేస్తున్న 40 మంది యానిమేటర్లు క్రమం తప్పకుండా గ్రామ సంఘాలు, చినసంఘాలు సమావేశాలు నిర్వహించి ఆ సమావేశాల్లో ఆర్థిక లావాదేవీలన్నీ సభ్యులు అందరికీ తెలిసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ అశోక్, సీసీలు హనోకు, రజని, సాంబయ్య, అకౌంటెంట్ శిరీష, మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

అందరికీ పథకాలు అందేలా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి

భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా మండల సమాఖ్య సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి తెలిపారు. మంగళవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లలితకుమారి మాట్లాడుతూ జగనన్న తోడు, హౌసింగ్ రుణాలు, జీవన జ్యోతి సురక్ష బీమా, బడుగు వికాసం, ఆసరా, చేయూత పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలని కోరారు. ఏరియా కో–ఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ అన్నిరకాల రుణాలు నూటికి నూరుశాతం రికవరీ ఉండేలా చూడాలని అన్నారు. ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, స్త్రీ నిధి మేనేజర్ అశోక్, సీసీలు హనోకు, రజని, సాంబయ్య, అకౌంటెంట్ శిరీష, మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ నడకతో బహుళ ప్రయోజనాలు

తెనాలి: నడకతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, దైనందిన జీవితంలో బిజీగా ఉండేవారు ప్రతిరోజూ కొంతసేపు నడవటం అలవరచుకుంటే ఆరోగ్యంగా ఉండగలరని ప్రవాస భారతీయుడు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి అన్నారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సమావేశానికి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ బాబు 'మన ఆరోగ్యం కాపాడుకోవటం ఎలా?' అనే అంశంపై ప్రసంగించారు. క్యారెట్, క్యాబేజీ, కీరా వంటి పచ్చికూరగాయలు తింటూ, ఆహార నియమాలు పాటిస్తూ, ప్రతిరోజూ నడవటం వల్ల గుండె, ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉండి జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందని చెప్పారు. ప్రతి ఆరోగ్య సమస్యకు మందులపై ఆధారపడొద్దని సూచించారు. క్లబ్ కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికిన సభలో పాలడుగు ఆనందయ్య, టి.రత్తయ్య, సీహెచ్ అశోక్‌కుమార్, మొవ్వా సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలకు చేరిన విద్యాకానుక కిట్లు



తెనాలిఅర్బన్: జగనన్న విద్యాకానుక కిట్లను స్టాక్ పాయింట్ల నుంచి ఆయా పాఠశాలలకు మంగళవారం విద్యాశాఖ అధికారులు పంపారు. కొత్తపేటలోని మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌కు ఉన్నతాధికారులు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక వాహనంలో వాటిని పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలకు పంపారు. పాఠశాలలు పునః ప్రారంభం కాగానే విద్యార్థులకు అందజేయనున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె: కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా మే31వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ప్రచారయాత్ర ఈ నెల 8వ తేదీ రేపల్లె విచ్చేస్తున్న సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్మికుల వద్ద నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. కార్మికులను అప్కస్ బోర్డులో చేర్చాలని, పర్మినెంట్ ఉద్యోగులకు సీపీఎస్ కాకుండా పాత పెన్షన్ అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్ వర్కర్లుగా వేతనాలు అమలు చేయాలని తదితర సమస్యలపై కార్మికుల వద్ద నుంచి సంతకాలు సేకరిస్తున్నామని, ప్రచార యాత్ర నాయకుల ద్వారా గవర్నర్‌కు వినతిపత్రాలు అందించటం జరుగుతుందని పేర్కొన్నారు.

దాడి ఘటనపై పరస్పర కేసులు

తెనాలిరూరల్: దాడి ఘటనపై పరస్పర కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ బీసీ కాలనీ రెడ్ల బజారులో భార్య భర్తల వివాదం గురించి మాట్లాడేందుకు ఇద్దరి తరఫు బంధువులు సోమవారం రాత్రి వెళ్లారు. ఈక్రమంలో చర్చలు ఘర్షణకు దారి తీయగా పరస్పర దాడికి పాల్పడ్డారు. రాత్రి పొద్దుపోయాక రెండు పక్షాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్టు టూ టౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు.

డ్రెయిన్ పూడికతీత పనులు ప్రారంభం

తెనాలిఅర్బన్: 32వ యడ్లలింగయ్య కాలనీలోని రైల్వేగేటు నుంచి గుంటూరు ట్రాక్ వరకు ఉన్న మెయిన్ డ్రెయిన్ పూడికతీత పనులు మంగళవారం ప్రారంభించారు. కాల్వలో ఉన్న వ్యర్థాలను పొక్లెయిన్‌తో తొలగించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, వైఎస్సార్ సీపీ నాయకుడు మట్లపూడి రాజేశ్వరరావులు మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పూడికతీత పనులు ప్రారంభించినట్లు చెప్పారు. డ్రెయిన్ వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

